# ★ సీతారాం ★

శ్రీ గూడ వేంకటచలపతిరావు

ఆయన నా ప్రక్కనున్న కుర్చీలో కూలబడి కొంచెం వెర్రిగా సీతారాం సీతారాం అంటూ కళ్లుమూసుకొన్నాడు. ఇంతకూ యీయనకు పిచ్చా? లేక భక్తి పారవశ్యకతా? అన్న సందేహం నన్ను బాధించసాగింది. మరొక పర్యాయం ఆవ్యక్తి సీతారాం అనగనే ఆపై వాక్యం మరచిపోయాడేమోనని, "పతితపావనంటూ" పైచరణాన్ని అందిచ్చాను. ఇంతవరకూ పిచ్చితనంగా ఉన్న ఆవ్యక్తి ఈమాట కొస్తా వినేటప్పటికి అమాంతంగా ముందునున్న బల్లమీద ఒక్క గుద్దు గుద్ది, "ఇప్పుడు మీరన్న ఆ పై వాక్యం ఉచ్చరించొద్దండీ", అది అనవసరం" అని అన్నాడు. ఆశ్చర్యంతో "యేం" అన్నాను "నేను" యేమా? ఇప్పుడు మీరన్న పతిత పావన సీతారాముడు భక్తులకోసం ఉద్భవించాడు. ఆయనతో భక్తులకు, భక్తులతో ఆయనకు అవసరం ఉంది కాని నాకేమవసరమండీ?, నా సీతారాం ప్రేమోపాసియగు నన్నుద్ధరించటానికి ఉద్భవించిది......"అని కొంచం ఆగి" "నిజంగా - నాదేవతను......నాసీతారాము......తిరిగిచూచే భాగ్యం......నాకీజన్మలో సంప్రాప్తమవుతుందండీ......" అని విచారంగా ఆయన నావైపు చూశాడు. నేనూ గడియారం చూసేసరికి సరిగ్గా యెనిమిది గంటలైంది. భోజనానికి ఇంకా మూడుగంటల టైముంది. ఈ మూడు గంటలకాలం కొస్త వినోదంగా వెళ్లబుచ్చాలనిపించింది. చేతిలోనున్న పత్రికను టేబుల్ మీదబెట్టి "యేమండీ స్వామి. పాపం మీరు చాలా విచారంగా ఉన్నట్టున్నారు. మిమ్మలజూస్తే నిజంగా నాకుగూడా జాలేస్తున్నది. చెప్పతగినదైతే మీవృత్తాంతం చెప్పండి. చేతనైతే యేదైనా సహాయంచేస్తా లేకపోతే విని సంతోషిస్తా" నని నేనన్నాను. నామాట వినటంతోనే ఆయన సంతోషంతో "ఆహా, అంతకంటేనా నాయనా. రెండు సంవత్సరాలనుండీ తిరుగుతుంటే నా యోగక్షేమం విచారించేవారు ఒక్కరూ కానుపించలేదు. నేటికి ఆకొరత మీరు తీర్చారు. విసుగులేనుండా వింటేచాలు నాసీతారాము వృత్తాంతం సాంతంగా వినిపిస్తానన్నాడు." "చిత్త" మన్నాను నేను. ఇహ ఆయన తన కథ ఈ విధంగా ప్రారంభించాడు.

'మా కాపురస్థలం తెనాలి. గవర్నమెంటు హాస్పటలుకు ప్రక్కనున్న మేడ అవతలి పెంకుటిల్లే మా స్వగృహం—'

'అయ్యా, అవిశచెట్టున్న ఇల్లేగాదా?' అని తెలియపోయి నా కథకు కొస్త అడ్డు తగిలాను. 'అది అవిశ చెట్టు కాదండీ. బాదంచెట్టు' అని సమాధానమిచ్చి మళ్ళీ ఆయన కథ ప్రారంభించాడు.

'ఆ ఇంట్లో మేమున్న భాగంగాక మరొక్క భాగం ఖాళీగా ఉంది—' 'స్వామీ, ఆఇంటిముందు పూరిల్లున్నట్టి జ్ఞాపకమే' అన్నాను నేను. ఛీ. ఛీ. మాటమాటకు అడ్డుతగిలితే నేనేం చెప్పేదండి. ఇంటిముందు పూరిల్లో పెంకుటిల్లో ఉండకుండా ఉటుందా? ఇంతకూ పొరపాటు నాదికాని మీది కాదులెండి.' అని పాపం ఆయన బిక్కమొగమేశాడు. వొచ్చిన నవ్వాపుకొని 'ఇహ నేనేమీ అడుగనులెండి మీరు చెప్తుంటే వింటుంటాను. చెప్పండి' అని అన్నాను నేను. ఆయన కొంచెం విసుగుతో మళ్లీ సోది ప్రారంభించాడు.

'ఆభాగంలోకి ఇప్పటికి సుమారు మూడు సంవత్సరాలక్రితం అప్పలాచార్లనే ఒక పెద్దమనిషి అద్దెకొచ్చాడు. మేము అద్వైతులం వారు ద్వైతులు కావడంవలన కొత్తలో బెట్టుగానున్నా పోను పోను అంతా యేక కుటుంబీయుల్లాగా మారిపోయాము. వారు మా ఇంట్లో మేము వారింట్లో నిస్సంశయంగా భోంచేస్తుండేవాళ్ళం. కాని ఆచార్లగారు మటుకు కొస్త సందేహిస్తుండే వారు.

ఆచార్లగారి భార్య రంగమ్మ భర్త బజారునుండివచ్చేదాకా మా అమ్మదగ్గరే పాటో పద్యమో చెప్పకుంటూండేది. కూతురు సీతారాముమటుకు యీడొచ్చిన పిల్ల గనుక...కొంచెం బెరుకుగా...తల్లిని చాటుచేసుకొని వస్తూ పోతూండేది. ఒకరోజు యేదో; ప్రస్తావనమీద...సీతారాము భర్త మూడు సంవత్సరాలక్రితం చనిపోయాడని చెప్పి రంగమ్మ కన్నీరు పెట్టుకొనేసరికి నాహృదయం తపించిపోయింది......సీతారాం కొంచెం పొడ్డుగా నల్లగానున్నా అందమైన మనిషేనని చెప్పాలి......యెప్పుడూ కళకళ్ళాడుతూ నవ్వుతుంటే ఆ ముఖం......ఆజారుజెడ......జంపెర జాకెట్టు...... నేటికీకూడా కన్ను

లకు కట్టినట్టున్నాయి.' అని ఆవ్యక్తి కొంచెం ఆగి మళ్లీ చెప్పడం ప్రారంభించాడు.

ప్రథమంలో కొంచెం సిగ్గుగానున్నా సీతారాం పోను పోను నాతో అతిచనువుగా ప్రవర్తించటం మొదలు పెట్టింది. పుస్తకానికనో పత్రికనో ఆ అమ్మాయి యెప్పుడూ నాగదిలోకివస్తూపోతుండేది. ఆచార్లగారు తరుచుఇంట్లో ఉండకపోవడం ఇంట్లోనున్న రంగమ్మ చూసీచూడనట్లు ఊరుకోటం మా స్నేహలత నిరాఘాటంగా వృద్ధిపొందడానికి సావకాశం చేకూర్చాయి. మేమిద్దరం ప్రతిరోజూ కొన్ని గంటలకాలం ఏకాంతంగా వినోదంతో గడుపుతుండేవాళ్లం. నేనన్న సీతారాముకు గొప్ప గౌరవం, అతిప్రేమ. సీతారామన్న నాకు ప్రాణసమానం...... ఆరోజులలో... సీతారాముతో వినోదంగా కాలక్షేపం చెయ్యటానికి అవకాశం దొరుకుతుందనితోస్తే... నా స్వంత పనులు మానుకొని కనిపెట్టుకుండేవాడిని...... యెటువంటి ప్రాణస్నేహితులొచ్చినా... ఇంట్లో ఉండి గూడా లేదనిపించేవాడిని... ఆనాటి చర్యలు తలుచుకుంటే నేటికూడా హృదయం జలదరించిపోతుంది. సీతారామును సంతృప్తి పరచటానికి... ఆరోజులలో... యెటువంటి కార్యమైనా... అతిసాహసంగా చేస్తుండేవాడిని.

ఒకనాడు ఆచార్లగారింట్లో లేకుండటంజూచి... ఆయన్ను అవమానపర్చటానికి ఒకవ్యక్తి తనకివ్వవలసిన యాభైరూపాయిలకు ఆస్తిజప్తుచేయించటానికి అమీనాను వెంటబెట్టుకొచ్చాడు. అమీనావచ్చి పెట్టా—బేడా బయటేస్తుంటే సీతారాము నావైపు అతిదీనంగా చూసింది. నాహృదయం నీరైపోయింది. నిజంగా ఆచార్లగారిమీద అభిమానం లేకపోయినా... నాసీతారామును సంతృప్తిపరుచుటకు... నాసోదరున కిష్టములేకపోయినా నేను జామీనుండి ఆవచ్చినవ్యక్తిని సాగనంపాను... యీదెబ్బతో రంగమ్మకు నామీద గౌరవం యెక్కువయిపోయింది.

పోనుపోను మా ఇద్దరిస్నేహం ప్రణయంగా మారిపోయింది. ఆచార్లగారు తరుచు ఇంట్లో నుండక పోవటం వలన మేమిద్దరం నిర్భయంగా ఆనందసాగరలో ఈదులాడుతుండేవాళ్లం... అప్పుడు సౌఖ్యంగా గడపినరోజులకు లెక్కేలేదు. మా ప్రణయబీజానికి రంగమ్మకూడా తగినంత దోహదమిస్తూ వృద్ధిపొందటానికి సావకాశం చేకూరుస్తుండేది. ఒకనాడు నేను రంగమ్మతో సీతారామును ప్రేమించటం... ఆ అమ్మాయిని వివాహమాడాలని నాకున్న అభిప్రాయం స్పష్టపరిచాను. రంగమ్మవిని మౌనం వహించింది. మౌనం అర్థాంగీకార సూచకంగా భావించి నేను సంతృప్తిపడ్డాను. సీతారామును వివాహమాడి సంఘాదర్శకుడను కావాలన్న పట్టుదల నానాటికి నాకెక్కువ కా సాగింది. కాని నెమ్మది నెమ్మదిగా మా ప్రణయవృత్తాంతం ఇటు మా సోదరునకు అటు ఆచార్లగారికి పూర్తిగా తెలిసిపోయింది. మతాంతర వితంతూ వివాహం చేసుకొని నేను చెడిపోతానని మావాడు తహతహ పడజొచ్చాడు. ఇటులైనా ఆచార్లగారిని ఇంటి నుండి సాగనంపాలని ప్రయత్నించటం మొదలెట్టాడు. ఆచార్లగారుకూడా ఇటనుండి యెంతతొందరలోపోతే అంతమంచిదనుకున్నాడు. ఇక్కడుంటో నిజంగా తన కూతురు పునర్వివాహంచేసుకొని కులానికి అపకీర్తి తెస్తుందని ఆయనకు నిస్సంశయంగా తోచిపోయింది... సాగనంపటానికి మావాడు... సాగిపోవటానికి ఆయన రహస్యంగా ప్రయత్నించటం మొదలెట్టారు ... కాని నాకీవిషయం వారు వెళ్ళిన తరువాత తెలిసింది.

ఒకరోజు నేను మావాండ్ల ఇంటికి భోజనానికెళ్ళి వస్తుండేసరికి మా ఇంటిముందునుండి వరుసగా—మూడు బండ్లు సాగిపోవటం కానుపించిది. ఎదురుగా వస్తున్న మావాడిని "బండ్లెవిరా" అని ప్రశ్నించేసరికి "ఆచార్లగారెళ్లుతున్నారని" జబిచ్చాడు. ఆవాక్యం వినేసరికి నాప్రాణంనిలువునా యెగిరిపోయింది... పిచ్చివాడలాగా బండ్లవైపు ఒక్కపరుగుదీశాను. 'మతిచలించిందాయేమిరా' అని మావాడు వెంటబడ్డాడు. అప్పటే రెండుబండ్లు మూలతిరుగుడుతిరిగి అవతలకు పోయినవి. చివరబండిలో రంగమ్మకు అవతల ప్రక్కనున్న సీతారాము సజల నేత్రాలతో నావైపు అతిదీనంగాచూచింది. ఆచూపు బల్లెపుపోటులాగా నాహృదయానికి తగిలింది... నేను అచేతనుడనై క్రిందబడితే మావాడు ఇంటికిచేర్చాడు. నాటి నుండి ... నాసీతారామును... ఒకపర్యాయము తిరిగిచూద్దామని ప్రయత్నిస్తుంటే... నేటివరకు కాసంతఫలితం కానుపించలేదు. ఆనాడు నాసీతారాం జూచినచూపుకు ... నేటికిగూడ... చూడు... ఇచ్చట... ఈ హృదయ్యం ... తాటాకు మంటలాగా మండిపోతున్నది... చూడు... అంటూ ఆవ్యక్తి ఉద్రేకంతో లేచి నిలుచుండేసరికి కాస్త భయమేసి నేను వెనుకకు తగ్గాను.

పాపం! ఆయన ఆ ఉద్రేకం పట్టలేక పిచ్చివాడిలాగా వాకిట్లోకి ఒక్క దూకుదూకి... "ఇదిగో... నాసితారామును వెతుకపోతున్నా"నంటూ పరుగెత్తాడు. నాకు ఆశ్చర్యం వేశింది. పాపం ప్రేమోద్రేకంవలన మతిచెడిపోయిందనుకుంటూ జరిగిన వృత్తాంతాన్ని ఆలోచిస్తూ కూర్చున్నాను.